క్లుప్తంగా

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

అశ్వారావుపేట: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సిబ్బందికి స్థానిక వ్యవసాయ కళాశాలలో గురువారం శిక్షణ నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించిన 603 సిబ్బందికి 595 మంది శిక్షణకు హాజరయినట్లు తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు.

నీటి సరఫరా సమయం కుదింపు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న పంప్ హౌస్ మోటార్‌లో ఏర్పడిన సమస్యల కారణంగా శుక్రవారం ఆ ప్రాంతంలో శుక్రవారం ఉదయం తాగు నీటి సరఫరా కేవలం 40 నిమిషాలు మాత్రమే ఉంటుందని మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పంప్ హౌస్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరాను కుదించినట్లు వెల్లడించారు. రంగనాయకుల గుట్ట వాసులు గమనించి సహకరించాలని కోరారు.

ఏఎస్పీ అభినందన

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థి నేత్ర నిఖిల్ ఇటీవల ప్రకటించిన సైనిక్ స్కూల్, నవోదయ ప్రవేశ పరీక్షల లో సీటు సాధించాడు. గురువారం నేత్ర నిఖిల్‌ను భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్ అభినందించారు. ఉన్నత లక్ష్యం పెట్టుకుని దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఏఎస్పీ అన్నారు. ఏజెన్సీ విద్యార్థులు సైనిక్ స్కూల్, నవోదయలలో సీట్లు సాధించేలా శిక్షణనిస్తున్న బ్రిలియంట్ అధ్యాపకులను ఆయన అభినందించారు.

స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థి

చండ్రుగొండ: ప్రభుత్వం అందించే నేషన్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ, తరగతి విద్యార్థి పోట్రు సాయిప్రశాంత్ అర్హత సాధించాడు. 2022–23 ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరైన సాయిప్రశాంత్ (రూ.12వేలు స్కాలర్‌షిప్) ఓసీ కేటగిరి నుంచి అర్హత సాధించాడు. గురువారం సాయిప్రశాంత్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మణుగూరుకు సుందరయ్యనగర్‌కి చెందిన కుంచం కిరణ్‌కుమార్, జానంపేటకు చెందిన పానగంటి తేజలు బజాజ్ షోరూం వైపు నుంచి మణుగూరు పట్టణంలోకి బైక్‌పై వస్తున్నారు. వారి ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో పక్కనే ఎదురుగా మిరప లోడ్ వస్తోంది. ఆ లోడ్‌కు బైక్ తగిని కింద పడింది. ఆ వెంటనే వెనుక నుంచి వస్తున్న లారీ వారి కాళ్లపైకి ఎక్కింది. దీంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా క్షతగాత్రులను వంద పడకల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

అశ్వారావుపేట: బీఆర్ఎస్ నాయకుడు టీపీసీ సభ్యుడు బిర్రం వెంకటేశ్వరరావును ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు గురువారం వినాయకపురంలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల బిర్రం వెంకటేశ్వరరావు ముక్కుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను కలిసిన నాయకులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, దిశ కమిటీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ, లీలా ప్రసాద్, కాసాని చంద్రమోహన్, ఉప్పల మురళి, తదితరులున్నారు.

భూమిపూజ

అశ్వారావుపేట: మండల పరిధిలోని గాండ్లగూడెం తండాలో రామాలయానికి గ్రామస్థులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామపెద్దలు పాల్గొని విజయవంతం చేశారు. మాలోతు ఆలీబాబు, భూక్యా ప్రసాద్, హలావత్ శ్రీను, భూక్యా శోభన్, హెచ్ లక్ష్మణ్‌నాయక్, భూక్యా సక్రు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని దత్తశేషసాయి ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా బాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం పూజలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బాబా వారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు బీటీవీ.రమణారావు, కెల్లా శేఖర్, కెల్లా అశోక్, కెల్లా వేణు మహిళలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇష్టారాజ్యం

- ధర తగ్గిస్తున్న వ్యాపారులు
- ప్రారంభానికే పరిమితమవుతున్న కొనుగోలు కేంద్రాలు
- పలు కారణాలతో మొదలుకాని కొనుగోళ్లు


కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలిస్తున్న వ్యాపారులు

అన్నపురెడ్డిపల్లి: ఆరుగాలాలు కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సరికి సరైన ధర లభించడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు, దిగుబడులోల తగ్గదలతో సతమతమౌతున్న రైతులకు.. వ్యాపారులు ధరలు తగ్గిస్తూ గిట్టుబాటు ధరకూడా లభించకుండా చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

మండలంలో 6100 ఎకరాల్లో సాగు..

రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా రైతులు వరి పంటను 6100 ఎకరాలలో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని అన్నపురెడ్డిపల్లి, రాజాపురం, పెంట్లం,బుచ్చన్నగూడెం, జానకీపురం, అబ్బుగూడెం గ్రామాలలో వరిని సాగుచేస్తారు. ప్రస్తుత సీజన్ లో 1లక్ష 58 వేల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. మండలంలోని రైతులు చేతికి వచ్చిన ధాన్యాన్ని కోతకోసి విక్రయిస్తున్నారు.

ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు..

చేతికి వచ్చిన పంటను రైతులు కోసి స్థానికంగా ఉండే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. తొలిత 70 కేజీల బస్తా ధాన్యానికి రూ.1500 నుంచి రూ1550 వరకు ధరను వ్యాపారాలు చెల్లించారు. కోతలు ముమ్మరంగా కోస్తుండడంతో ధాన్యం రాక ఎక్కువగా ఉండటం గమనించిన వ్యాపారులు ప్రస్తుతం రూ.1400 నుంచి రూ 1430 మాత్రమే ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలకు కనీసం రూ.300 వరకు నష్టపోతున్నారు. అదేవిధంగా వ్యాపారులు రైతుల వద్ద నుంచి తరుగు పేరుతో ఒక కేజీ, మొగ్గ పేరుతో 400 గ్రాముల నుంచి 600 గ్రాముల వరకు తీసుకుంటు రైతులను దోసుకుంటున్నారు. రానున్న రోజుల లో వ్యాపారులు ధాన్యం రేటును మరింత తగ్గించి కొనుగోలు చేస్తారని రైతులు అభిప్రాయపడుతున్నారు. కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేసరికి వ్యాపారులు కనీస మద్దతు ధర కూడా చెల్లించకుండా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు తెలుపుతున్నారు.వ్యాపారులు ధరలు తగించి కొనుగోలు చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా ఉండడంతో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రారంభం కాని ధాన్యం సేకరణ..

రైతులను వ్యాపారుల బారినుంచి కాపాడడం కోసం, రైతులకు కనీస మద్దతు ధర లభించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలో గుంపెన సహకార సంఘం ఆధ్వర్యంలో 1వ తారీకున కొనుగోలు కేంద్రాలను అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రారంభించారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ధాన్యాన్ని సేకరించలేదని రైతులు చెబుతున్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల నుంచి కూపన్లు తీసుకువస్తే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సొసైటీ అధికారులు తెలుపుతున్నారు. త్వరగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని సేకరించి, వ్యాపారుల బారినుంచి తమను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ధర తగిస్తున్నారు..



ప్రస్తుతం ధాన్యం ఎక్కువగా రావడంతో వ్యాపారులు మార్కెట్ లేదంటు ధర తగ్గిస్తున్నారు. కోసిన పంట పాడవుతుందనే భయంతో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. అయిన కూడా ఒకే గ్రామంలో ఒకరికి ఒకరేటు, మరొకరి మరోరేట్‌ను పెడుతూ ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు.

– దండి అప్పయ్య, రైతు, రాజాపురం

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి, మద్దతు ధర పొందాలి. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు రావాలి. వ్యాపారాలను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు.

– సున్నం వెంకటేశ్వర్లు, గుంపెన సొసైటీ సీఈఓ

కొయ్యూరు పీహెచ్‌సీలో 'అమ్మ కోసం'


అమ్మ కోసం క్లినిక్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యుడు..

చర్లరూరల్: అమ్మకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుట్టిన దగ్గర నుంచి 42 రోజుల వరకు ప్రతీ బాలింతలు వారానికోసారి అమ్మకోసం క్లినిక్‌కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కొయ్యూరు వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. 42 రోజుల నుంచి ఒక సంవత్సరం వరకు నెలకు ఒకసారి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలన్నారు.అవసరం అయితే వైద్య వాహనాల ద్వారానైనా ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వివరించారు.

ట్రాఫిక్‌కు అంతరాయంపై చర్యలు

మణుగూరురూరల్: వాహన దారులు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రధాన రహదారి మధ్యలో కొంతమంది వాహనదారులు తమ కార్లను, ఆటోలను, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, తద్వారా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. రహదారి మధ్యలో వాహనాలను నిలపడం వల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకపై వాహనదారులెవ్వరూ తమ వాహనాలను రోడ్డుకు మధ్యలో పార్కింగ్ చేయరాదని, రోడ్డు కు ఇరువైపులా ఏర్పాటు చేసిన తెల్ల గీత లోపల మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా యజయానులు వాహనాలను పార్కింగ్ చేస్తే జరిమానా విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్ ఉన్న రాజుపేట కాలనీ వద్ద ఉన్న శ్రీరామ గాయత్రి ఆలయాన్ని గురువారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం సందర్శించారు. ఇటీవల ఆలయంపై సూర్య రథంలో ఉన్న శ్రీగాయత్రీ దేవి అధిష్టించారు. అలాగే శిల్పకళ, యాగశాల, అన్నదాన వసతి హాలు నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు సంకల్పించారు. కాగా గురువారం సూర్యరథంలో ఉన్న శ్రీగాయత్రీ దేవి అధిష్టించిన సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన పూజాది కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీగాయత్రోపాసకులు, ఆలయ అధ్యక్షులు ఎమ్. రామ బ్రహ్మాచారి శాలువాతో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. పలువురు భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు పూనెం వీరభద్రం, సెక్రటరీ కడియం శ్రీను, జాయింట్ సెక్రటరీ గోవర్ధన వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ మామిడి వీరభద్రంతో పాటు ప్రముఖ పురోహితులు కాకరాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న షిరిడీ సాయి బాబా ఆలయంలో గురువారం సందర్భంగా బాబాకు అభిషేకం నిర్వహించి, స్వర్ణ ఆభరణాలు దరింప చేసి హారతి పాడారు. అనంతరం సారపాక ఐటీసీ కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్న మల్లాది వెంకటరామారావు పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బాబా ఆలయానికి రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రామారావుని ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి, బాబా మోమెంటోను అందజేశారు. ప్రతి గురువారం బాబా ఆలయంలో జరిగే నిత్య అన్నందానం కార్యక్రమానికి సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సద్గురు ప్రాంగణంలో భక్తసందోహం


మరకత లింగానికి అభిషేకం చేస్తున్న గురూజీ వీరభద్రం దంపతులు


అభిషేకానికి కలశాలతో బారులుదీరిన మహిళలు

ములకలపల్లి: రామచంద్రాపురంలోని సద్గురు ఆశ్రమం భక్తజన సంద్రమైంది. అచలపీఠంలో విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా హాజరైన భక్తుల హర హర నామస్మరణ నడుమ ప్రాంతమంతా భక్తి భావంతో వెల్లివిరిసింది. సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ ఆధ్వర్యంలో విశ్వేశ్వరస్వామి (మరకతలింగం), దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠా గురువారంతో ముగిశాయి. మూడు రోజులకు వేడుకలు విశ్వధర్మ క్షేత్ర వ్యవస్థాపకులు. గాయత్రీ ఉపాసకులు వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, రుద్రహోమం, అలయ సంస్కారం, కుంభ, బింభ ప్రతిష్ఠ, హోమాలు, పూర్ణాహుతి, శాంతికల్యాణం చేశారు. చివరిరోజు భారీగా భక్తులు హాజరుకాగా, ముహూర్త సమయం 9గంటల 9 నిమిషాలకు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో మరకత లింగాన్ని ప్రతిష్ఠించారు. ఈసమయంలో భక్తుల శివ నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అనంతరం నిర్వహించిన అభిషేకాలు మహిళలు భారీగా హాజరయ్యారు. రజనీ మాత, వీరభద్రం గురూజీ దంపతులు తొలుత అభిషేకాన్ని నిర్వహించి, లాంఛనంగా ప్రారంభించగా.. 1,008 కలశాలతో అభిషేక క్రతువు నిర్వహించారు. అనంతరం మహదాశీర్వచనం, పండిత సత్కారం చేశారు, భక్తులకు అన్నప్రసాదం చేశారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


కొమ్ముగూడెంలో కొర్రాజుల దేవుడి జాతరలో ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో పొడియం వారి ఇలవేల్పు కొర్రాజుల దేవుడి జాతర మహోత్సంలో గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాయం కొర్రాజుల దేవుడి జాతరలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొండికుంట గ్రామంలో కొమరం వెంకన్న–సరోజిని దంపతుల కుమార్తె సింధు పుష్పాలంకరణ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని సింధును ఆశీర్వదించారు. గొల్లగూడెంలో తోట శ్రీహరి–ఉపేంద్ర దంపతుల కుమారుడు శేఖర్ వివాహ వేడుకలో, అశ్వాపురంలో సింగు శ్రీనివాసరావు–మాధవి దంపతుల కుమార్తె రాజకుమారి వివాహ వేడుకలో ఎమ్మెల్యే పాయం పాల్గొని నూతన వధువరూలను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

అశ్వాపురం: ఈ నెల 6న హైదరాబాద్‌లో తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న జరిగే భారీ బహిరంగ సభకు మండలంలో 24 గ్రామ పంచాయతీలలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కాకా రాములు, చెంచల రాము, నరసింహారావు, సంపత్, శశికాంత్, మాదినేని నరసింహారావు, గొల్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన


డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దమ్మపేట: మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా గల డ్రెయినేజీలోని వ్యర్థాలను తొలగించి, పరిశుభ్రం చేస్తున్న పనులను స్థానిక ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో డ్రెయినేజీను శుభ్రపరిచే ప్రక్రియను గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పనులను పరిశీలించిన ఎంపీడీఓ, డ్రెయినేజీలను పూర్తిగా శుభ్రపరిచి, మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రామారావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి పరామర్శ

దమ్మపేట: దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ, ఇటీవల మృతి చెందిన ఓ చిన్నారి చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటుగా నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన మెచ్చు వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేకు సమీప బంధువు కాగా ఆయన కుమార్తె తేజస్వీ అనారోగ్యంతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. గురువారం గండుగులపల్లి గ్రామంలో చిన్నారి తేజస్వీ చిత్రపటానికి ఎమ్మెల్యే జారే, పలువురు కాంగ్రెస్ నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు చిన్నశెట్టి యుగంధర్, సొసైటీ డైరెక్టర్ చిన్నశెట్టి సత్యనారాయణ, బోజ్యనాయక్, శేఖర్, నరసింహరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావ్

చర్లరూరల్: మండలంలోని గుంపెనగూడెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్థభం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు గామస్తులు అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఓటుహక్కుపై అవగాహన


మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, దివ్యాంగులు


అశ్వారావుపేటలో ఓటరు అవగాహన ర్యాలీ..

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని దివ్యాంగులకు ఓటు హక్కుపై అధికారులు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని పలు పంచాయతీలలో ఎంపీడీఓ మహాలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్‌ల సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని దివ్యాంగులు ఓటు హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ప్రజాస్వామ్యం ఓటు అనే వజ్రాయుధాన్ని పౌరులకు అందించిందని, దాన్ని సద్వినియోగం చేసుకుని మంచి నాయకులను ఎన్నుకుని భవితకు బంగారు బాటలు వేసుకోవాలని భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, దుమ్ముగూడెం ప్రాజెక్ట్ అధికారి నవ్యశ్రీ పిలుపునిచ్చారు. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం 'స్వీప్' ఆధ్వర్యంలో భద్రాచలం అంగన్‌వాడీ సిబ్బంది పట్టణంలో ర్యాలీ తీశారు. స్థానిక తాత గుడి సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కూనవరం రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కూనవరం రోడ్డులో గల మానవసేవా వాలంటరీ ఆర్గనైజేషన్ ఆశ్రమంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సును సీడీపీవో నవ్యశ్రీ నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్యశ్రీ మాట్లాడుతూ.. ఓటు హక్కుపై అగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు సావిత్రి, మణి, సుహానా, ఆర్‌ఐలు నరసింహ రావు, బిక్కులాల్, దివ్యంగులు, వృద్ధులు, ఐసీడీఎస్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు సూచించారు. ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యతపై గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధికారులు, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బందితో పాటు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొని ఓటు ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటు హక్కు వజ్రాయుధలాంటిదన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసి జరగబోయే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఏపీఓ అహ్మదుల్లా, సీడీపీఓ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిషిపేషన్(ఎస్‌వీఈఈపీ) ఓటరు అవగాహనా ర్యాలీని గురువారం అశ్వారావుపేటలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ రోజారాణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, పద్మావతి, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్లు తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో పనివేళలు మార్చాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో గనుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పనివేళలు మార్చాలని, కార్మికులకు మిఠాయిలు, జ్ఞాపికలు అందజేయాలని కోరుతూ.. ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, గట్టయ్యలు ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో భారీ యంత్రాల నడిపే ఆపరేటర్లతో పాటు ఇతర కార్మికులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున గతంలో మార్చిన మాదిరిగానే పనివేళలు మార్చాలని కోరారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతూ 2023–24 వార్షిక లక్ష్యాలు సాధించిన సందర్భంగా కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల విశ్రాంతి భవనాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలని మ్యాన్‌వే వద్ద ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎస్ఓటూ జీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ.షాబుద్దీన్, నాయుడు, కరుణాకర్, సురేశ్, రవి తదితరులు ఉన్నారు.